
ప్రజాశక్తి
బుధవారం 15 మార్చి 2023
5
పార్వతీపురం మన్యం



## రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి దుర్మరణం

### హాల్ టికెట్ తీసుకుని వస్తుండగా ప్రమాదం

ప్రజాశక్తి- మక్కువ

మండలంలోని మక్కువ-శంబర రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. మరిపి వలస గ్రామానికి చెందిన కోట బాలు, దబ్బగడ్డ గ్రామానికి చెందిన కార్తీక్ ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు బుధవారం నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్ కోసం కాలేజీకి వెళ్లి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. మక్కువ సమీపంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకు దగ్గర వీరు నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో వెనక కూర్చున్న కోట బాలు కిందపడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కార్తీక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

# ఎవరి ధీమా వారిదే

**ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. గెలుపు తమదంటే తమదంటూ వైసిపి, టిడిపి చెప్ప కుంటున్నాయి. డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయం ఖాయమంటూ పిడిఎఫ్ మద్ధతుదారులు అంటున్నారు. ఇక బిజెపి అభ్యర్థికి నాలుగో స్థానమేనని మెజార్టీ జనం అంచనా వేస్తున్నారు. దీన్నిబట్టి ముక్కోణపు పోటీ ఉన్నట్టు కనిపిస్తోంది. ఎవరు గెలిచినా రెండో ప్రాధాన్యత ఓటే కీలకం కాబోతుందని రాజకీయ నాయకుల విశ్లేషణ.**

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



రమా ప్రభ (పిడిఎఫ్)
చిరంజీవిరావు (టిడిపి)
సుధాకర్ (వైసిపి)

- సంక్షేమ పథకాలు ఆకర్షిస్తాయని వైసిపి ఆశ
- వైసిపిపై వ్యతిరేకతను నమ్ముకున్న టిడిపి
- పాలకపార్టీల ప్రజావ్యతిరేక విధానాలు, నిబద్ధత గెలిపిస్తాయంటున్న పిడిఎఫ్
- బిజెపికి నాలుగో స్థానమే అంటున్న విశ్లేషకులు
- కీలకం కానున్న రెండో ప్రాధాన్యత ఓటు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ సోమవారం జరిగిన విషయం విధితమే. బ్యాలెట్ బాక్సులన్నీ అదేరోజు రాత్రి ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు నడుమ విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియానికి తరలించారు. ప్రస్తుతానికి అభ్యర్థుల భవితవ్యం ఆయా బాక్సుల్లో నిక్షిప్తమై ఉంది. ఈనెల 16న ఓట్లలెక్కింపు జరగనుంది. అదేరోజు ఎన్నికల ఫలితాలు కూడా వెలువడనున్నాయి. విజయనగరం జిల్లాలో 58, 502 మంది ఓటర్లకు గాను 43,862 (74.98శాతం) మంది ఓటర్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 18,520 ఓటర్లకు గాను 13,619 (73.54శాతం) మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని బట్టి విజయనగరం జిల్లాలో గజపతినగరం, ఎస్.కోట, రాజాం, బొబ్బిలి నియోజకవర్గాల్లో పిడిఎఫ్, టిడిపి అభ్యర్థులు లీడింగ్‌లో ఉండవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో పిడిఎఫ్, వైసిపిల మధ్య పోటీ ఉంటుందని తెలుస్తోంది. అటు పార్వతీపురం జిల్లాలో కురుపాం నియోజకవర్గంలో పిడిఎఫ్, టిడిపి అభ్యర్థుల మధ్య, సాలూరు, పాలకొండ, పార్వతీపురం నియోజకవర్గాల్లో పిడిఎఫ్, వైసిపి అభ్యర్థుల మధ్య పోటీ ఉందని తెలుస్తోంది. దీన్నిబట్టి ఈ రెండు జిల్లాల్లో పిడిఎఫ్‌కు అనుకూలంగా ఓటింగ్ పడినట్టుగా ఎక్కువ మంది భావిస్తున్నప్పటికీ అభ్యర్థుల గెలుపు ఓటమి అనేది మొత్తం ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల బలబలాలను బట్టి ఉంటుంది. విశాఖనగరంలోని ఓట్లు కూడా అత్యంత కీలకపాత్ర పోషించనున్నాయి. నగరంలోని ఓట్లు పిడిఎఫ్‌కే ఎక్కువగా పడతాయని అంచనాలు వెలువడ్డాయి. కానీ, అక్కడ ఓటింగ్ శాతం తక్కువగా ఉండడం వల్ల పరిస్థితి ఎలా ఉంటుందన్న దానిపై రాజకీయ విశ్లేషకులు సైతం మల్లగుల్లాలు పడుతున్నారు. ఇక అనకాపల్లి జిల్లాలో పిడిఎఫ్‌కు వైసిపి గట్టిపోటీ ఇచ్చిందని వార్తలు వినిపిస్తున్నాయి. అటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో టిడిపి, పిడిఎఫ్ మధ్య హోరా హోరీగా ఓటింగ్ సాగిందని అంచనా. శ్రీకాకుళం జిల్లాలో పిడిఎఫ్‌కి టిడిపికి మధ్య గట్టి ఉందని సమాచారం. దాదాపు అన్ని చోట్లా పిడిఎఫ్ పోటీ ఇచ్చినట్టు అంచనాలు వినవస్తున్నప్పటికీ ఒకటో ప్రాధాన్యత ఓటులో పిడిఎఫ్ సహా ఎవరికీ అవకాశం ఉండకపోవచ్చని పలువురు వాదిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎవరికివారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీ నాయకులు వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు అన్ని వర్గాల ప్రజానీకం ఆకర్షితులయ్యారని, ఆ పథకాలే తమను గెలిపిస్తాయని చెబుతున్నారు. టిడిపి నాయకులు మాత్రం సిఎం జగన్మోహన్‌రెడ్డి నిరంకుశవైఖరి తమ గెలుపునకు దోహదపడుతుందని, జనం కూడా ప్రభుత్వంపై విసిగిపోయి ఉన్నారని అంటున్నారు. వైసిపి అవలంభించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా వ్యతిరేక విధానాలకు తోడు మన రాష్ట్రాన్ని మోసం చేసిన బిజెపిపై నోరు మెదపకపోవడం వంటి విధానాలు, వాటికి వ్యతిరేకంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీల నిబద్ధతగల పోరాటం తమకు విజయం చేకూరుస్తుందని రమాప్రభ మద్దతుదారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల పట్ల కొద్దోగొప్పో నమ్మకం ఉన్నవారు కూడా రెండో ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ అభ్యర్థికే వేశారని మరికొందరి అంచనా. గురువారం రాత్రికి గెలుపు గుర్రం ఎవరో తేలనుంది.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న 28,118 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ప్రజాశక్తి-కలెక్టరేట్/పార్వతీపురంరూరల్

ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 4 తేదీ వరకు జరగనున్న పరీక్షలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షకు మొదటి ఇంటర్ విద్యార్థులు 24,463 మంది, ద్వితీయ ఇంటర్ విద్యార్థులు 23,655 మంది హాజరు కానున్నారు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాలులోకి అనుమతించే అవకాశం లేదు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందు అంటే ఉదయం 8.30 గంటలకే చేరుకోవాలని అధికారులు తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రాతిపదికన పరీక్షలు జరుగుతున్నాయి. మొత్తం 78 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. వీటిలో 42 ప్రైవేటు కాలేజీలు కేంద్రాలు, 36 ప్రభుత్వ కాలేజీ కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. పరీక్ష నిర్వహణకు ఇన్విజిలేటర్లు 1500 మందిని నియమించారు. 4 ఫ్లయింగ్ స్క్వాడ్ లు, 10 సిటింగ్ స్క్వాడ్లను, 78 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 11318, రెండో సంవత్సరం విద్యార్థులు 10945 పరీక్షలు రాయనున్నారు. జిల్లాలోని 31 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ముడు ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లు పరీక్షలను పర్యవేక్షించనున్నాయి. ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్దులకు పరీక్ష కేంద్రాల్లో అనిన మౌలిక సౌకర్యాలు కల్పించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు సిబ్బంది, పోలీసులు, మెడికల్ సిబ్బంది కూడా సెల్ ఫోన్లకు అనుమతి లేదు. విద్యార్థులకు హాల్ టికెట్ల సమస్య ఉంటే వెంటనే 08922-237988, 9392911825 ఫోన్ నెంబర్లకు ఫిర్యాదు చేయాలని అధికారులు తెలిపారు.



పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో నెంబర్లు వేస్తున్న సిబ్బంది

**సీతంపేట :** బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ కె.విశ్వనాథం తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్థానిక బాలుర గురుకుల కళాశాలలో 339 విద్యార్థులు, బాలికల గురుకుల కళాశాల 349 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాల్లో అల్లూరి సీతారామరాజు ఒకేషనల్ కళాశాల, కెజిబివి కళాశాల, సిఐవై మల్లి కళాశాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఒక్కొక్క రూంకు 22 మంది విద్యార్థులు ఉంటారని తెలిపారు. ఒక్కొక్క పరీక్ష కేంద్రానికి 10 రూములు కేటాయించమని తెలిపారు.

**సీతానగరం** : ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.రేణుక తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాల్లో మూడు కాలేజీల నుంచి విద్యార్థులు హాజరవుతాం న్నారు. మొదటి సంవత్సరం 377 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం విద్యార్థులు 334 మంది పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. వీరితో పాటు ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు కూడా పరీక్షలు రాయనున్నార న్నారు. పరీక్షా కేంద్రంలో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలన్నారు.

**భామిని :** ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల, ప్రభుత్వం జూనియర్ కళాశాల, కెజిబివి, ఆదర్శపాఠశాల నుండి 578 విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. పరీక్షా కేంద్రంలో ప్రతి గదిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు..

**వీరఘట్టం** : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ ఫస్ట్ ఇయర్ 289 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు సిఎస్ పి.శంకరరావు తెలిపారు. ఇందుకు 14గదులను ఏర్పాటు చేశామని తెలిపారు.



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న డిఇఒ రమణ

## విద్యాబోధనను పర్యవేక్షించాలి : డిఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి తరగతికి వెళ్లి ఉపాధ్యాయులు బోధన ఎలా చేస్తున్నారని పర్యవేక్షించి రిమార్కులు రాసుకోవాలని డిఇఒ ఎస్‌డివి రమణ ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీధర్‌ను ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తరగతిగదికి వెళ్లి ఉపాధ్యాయుల బోధన వినాలన్నారు. తద్వారా రాబోయే రోజుల్లో విద్యార్థులు విద్యాభివృద్ధి చెందుతారని స్పష్టం చేశారు. వారానికి నాలుగు క్లాసులు విద్యార్థులకు బోధించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 10,800మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. 64 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామనిస్పష్టం చేశారు. 19 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 50 సిఎస్‌లు, డిఒలను నియమించామని తెలిపారు. జిల్లాలో నాలుగు సమస్యాత్మక పరీక్ష కేంద్రాలున్నట్లు గుర్తించామని, ఈ కేంద్రాల్లో అధిక శాతం సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. విద్యార్థులు చక్కగా చదివి మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు. ఈయనతో పాటు ఎపిఒ హరి ఉన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ఓడిపోవాలి

- అధినేతకు జ్ఞానోదయం కలగాలంటే తీర్పు మారాలి
- అధికార పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశమైన వైనం

ప్రజాశక్తి - సాలూరు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిని బరిలోకి దించి గెలుపు కోసం కొన్ని ప్రాంతాల్లో అడ్డదారులు తొక్కనా పార్టీ శ్రేణుల్లో మాత్రం విభిన్నమైన అభిప్రాయం వ్యక్తమైంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించి తీరాలని సిఎం జగన్ మోహన్‌రెడ్డి మంత్రులను, ఎమ్మెల్యేలను ఆదేశించారు. కౌన్సిల్‌లో పిడిఎఫ్ ఎమ్మెల్సీల వాణి వినిపించకూడదనే ఉద్దేశంతో వైసిపి అధినేత పెద్ద నాయకులకు గెలుపు బాధ్యతలు అప్పగించారు. అయితే ద్వితీయ శ్రేణి అధికారపార్టీ నాయకులు, కార్యకర్తల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి ఓడిపోతే తమ అధినేత అహంకారం కొంతవరకైనా తగ్గుతాదని అనేక మంది కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. బయటకు వారు చెప్పలేకపోయినా వారి మనసులో మాటను అక్కడక్కడా వ్యక్తపరిచారు. పార్టీకి చెందిన పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపిపిలు వైసిపి రాష్ట్ర నాయకత్వం తీరుపై అసంతృప్తితో ఉన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నర ఏళ్లయినా స్థానిక ప్రజాప్రతినిధుల కష్టాల గురించి పట్టించుకోలేదనే ఆవేదన వారిలో గూడుకట్టుకుని ఉంది. స్థానిక స్వపరిపాలనకు భిన్నంగా ప్రజలచేత ఎన్నికైన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపిపిలను ఉత్సవ విగ్రహాలను చేసి సచివాలయాలు, వాలంటీర్ల కనుసన్నల్లో సంక్షేమ పథకాల అమలు చేయడంతో వారిలో తీవ్ర అసంతృప్తి రగిలిస్తుంది. అంతేకాక అప్పులు చేసి గ్రామాల్లో, పట్టణాల్లో అభివద్ధి పనులు చేస్తే ఏళ్ల తరబడి బిల్లులు మంజూరు కాకపోవడం కూడా వారిలో అసంతృప్తికి ఆజ్యం పోస్తోంది. సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపిపిలు పదవుల కోసం రూ.10లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చు చేయడం ఒక ఎత్తైనా, చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు కాక చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామనే బాధ వారిలో అంతర్లీనంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపికి ప్రతికూల ఫలితాలొస్తేనే అధినాయకుడి వైఖరిలో మార్పు వస్తుందని భావిస్తున్నారు. ఇలాంటి అభిప్రాయాలను డిప్యూటీ సీఎం రాజన్నదొర వద్ద కూడా పలు సందర్భాల్లో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలోనూ డిప్యూటీ సీఎం, మంత్రి హోదాలో ఉన్న రాజన్నదొర చిత్తశుద్ధితో పనిచేశారు కానీ కింద స్థాయి నాయకుల్లో మాత్రం గెలుపు బాధ్యతలు స్వీకరించిన దాఖలాలు కనిపించలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి నుంచి పుష్కలంగా నిధులు వస్తాయని, వాటితో ఓట్లను కొనుగోలు చేసే క్రమంలో కొంత వెనకేసుకోవచ్చునని చాలా మంది నాయకులు భావించారు. అయితే అందుకు భిన్నంగా ఆఖరి నిమిషం వరకూ ఓటర్లను ప్రలోభపెట్టడానికి నిధులు రాలేదు. అయితే పోలింగ్ బూత్ ఖర్చులు, ఏజెంట్ ఖర్చుల వరకు మాత్రమే నిధులు మంజూరు కావడంతో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఢీలా పడ్డారు. ఏమైనా రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపికి వ్యతిరేకంగా తీర్పు వస్తే సిఎం జగన్ వైఖరిలో మార్పు రావడానికి అవకాశం ఉంటుందని సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలే అభిప్రాయపడుతున్నారు.



కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న సిఐటియు నాయకులు

## మహనీయుడు మార్క్స్

ప్రజాశక్తి - సాలూరురూరల్

అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ మానవ జాతి చరిత్రకు మానవుడే కారణమని తెలిపిన మహనీయుడు కారల్ మార్క్స్ అని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్‌వై నాయుడు అన్నారు. స్థానిక ఐసిడిఎస్ రూరల్ కార్యాలయంలో కారల్ మార్క్స్ 139వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవితమే ఒక విప్లవం అని వెనుకబడిన ఐరోపా దేశాల్లో ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా పోరాటాలు కొత్త సమాజానికి బాటలు వేశారని, పెట్టుబడిదారుల సమాజంలో కార్మిక వర్గం పుట్టుకొచ్చిందని అన్నారు. దీని ఫలితంగా పనిగంటలు తగ్గింపు, జీవించడానికి సరిపడా జీతం, మెరుగైన పరిస్థితులు, హక్కుల కోసం కార్మిక సంఘాలు తిరుగుబాటు చేసే విధానం వచ్చిందని అన్నారు. నేడు మన దేశంలో దోపిడీ వ్యవస్థ సమర్థకులు మార్క్సిజానికి కాలం చెల్లిందని చెప్తున్నా, ఇప్పటికీ ప్రపంచంలో కోటాను కోట్ల కార్మికులు, పీడిత, తాడిత బడుగు, బలహీన వర్గాలు వారు తమ హక్కుల కోసం పోరాడుతున్నది ఆయన చూపిన మార్గమేనని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఏ నారాయణమ్మ, అంగన్వాడీ నాయకులు తిరుపతమ్మ, సావిత్రి, సుభద్ర, గౌరీశ్వరి పాల్గొన్నారు.

# నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పాలకొండ/భామిని

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం కలుగుతుంద సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని స్థానిక నీలమ్మ కాలనీ యుపిహెచ్‌సి వద్ద, భామిని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో సబ్ కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేయించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యం మహా భాగ్యం అన్నారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. డిఎంహెచ్‌ఒ బి.జగన్నాధరావు మాట్లాడుతూ 1-2 ఏళ్ల వయస్సు గల పిల్లలకు అర మాత్ర, 2-5 ఏళ్ల వయస్సు గల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో ఒక మాత్ర గుండ చేసి ఇస్తామన్నారు. 19 ఏళ్లలోపు వయస్సు గల వారికి 400 ఎం.జి అల్బెండజోల్ ఒక మాత్ర చొప్పున ఇస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. మంగళవారం మాత్రలు తీసుకోని వారికి 18 వరకు నిర్వహించే మాప్ అప్ కార్యక్రమంలో మాత్రలు అందించి మింగిస్తున్నామని తెలిపారు. మాత్రలు తీసుకోవడంతో పాటు పిల్లల చేతులు పరిశుభ్రత, చెప్పులు ఉపయోగించడం, బహిరంగ మల విసర్జన నిర్మూలన వంటి విషయాలపై ఆరోగ్య అవగాహన కల్పించామని చెప్పారు. 482 అంగన్వాడీ కేంద్రాలు, 364 విద్యా సంస్థలు, 27 ప్రైవేట్ పాఠశాలలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, డెప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.విజయపార్వతి, పాలకొండ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, డిటిరొ డాక్టర్ ఎ.శ్యామ్‌కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహన రావు, భామిని ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, పాలకొండ ఎంపిపి బి.భాను గురుకులం ప్రిన్సిపల్ ఎం.విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.



భామినిలో విద్యార్థినికి నులు పురుగునివారణ మాత్ర వేస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

**వీరఘట్టం :** రెండేళ్ల నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు తప్పనిసరిగా నులిపురుగు మందులు వేసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్మోహరావు విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం నడుకూరు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో డి -వార్మింగ్ సందర్భంగా పిల్లలకు మందులు వేసే కార్యక్రమంలో మాట్లాడారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కొని ఆహారం తీసుకోవాలన్నారు. అలా చేస్తే వ్యాధులు దరిచేరవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్, సూపర్వైజర్ జయగౌడ్, ప్రధానో పాధ్యాయులు అన్నాజీరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**సీతంపేట :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డి వార్మింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నులు పురుగుల నివారన మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ జీవనజ్యోతి, అధ్యాపకులు శంకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 20న ప్రాంతీయ స్థాయి డాక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం

విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం దృష్ట్యా ఈనెల 20న విశాఖపట్టణంలో ప్రాంతీయస్థాయి డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు విజయనగరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎ.ఈశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంవిపి బస్ కాంప్లెక్స్ పక్కనున్న పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయంలో 20న ఉదయం 11 గంటలకు 109వ అదాలత్ జరుగుతుందని, తపాలా వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదులను ఈ నెల 16వ తేదీ లోగా 109వ తపాలా అదాలత్, డబ్ల్యు నాగాదిత్య కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టు మాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్టణం- 530017 అనే చిరునామాకు పంపించాలని సూచించారు.


## 25న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమావేశం

**విజయనగరం :** ఇటీవల అనివార్య కారాణాల వల్ల వాయిదా పడిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విజయనగరం జిల్లా శాఖ వార్షిక సాధారణ సర్వ సభ్య సమావేశం ఈనెల 25న నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి సత్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో కమిటీ ప్రెసిడెంట్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, దానిలోనే మేనేజింగ్ కమిటీ మెంబర్ల ఎంపిక ప్రక్రియ కూడా ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని రెడ్ క్రాస్ జీవిత కాల సభ్యులు, ప్యాట్రన్లు, వైస్ ప్యాట్రన్లు, కమిటీ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని ప్రకటన ద్వారా కోరారు.

# జిల్లాలో ఐదు స్కిల్ హబ్‌లు

- 1నుంచి కోర్సులు ప్రారంభం
- జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్



రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ఐదు స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేయనున్నామని, ఏప్రిల్ 1నుంచి కోర్సులు ప్రారంభం కానున్నాయని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ఇందులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గుమ్మలక్ష్మీపురం, ప్రభుత్వ ఐటిఐ కళాశాల సాలూరు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల సాలూరు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల- పార్వతీపురం, ప్రభుత్వ ఐటిఐ కళాశాల సీతంపేటలో ఏర్పాటు చేశామని తెలిపారు. గుమ్మలక్ష్మీపురం స్కిల్‌హబ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్, కుట్టు మిషన్ ఆపరేటర్ కోర్సులకు ట్రైనింగ్ ఇచ్చామన్నారు. ట్రైనింగ్ అనంతరం వారికి ఉపాధి అవకాశం ఇస్తామన్నారు. వీరి విద్యార్హత 8వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తి గలవారు 33497878878557 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. పార్వతీపురం స్కిల్ హబ్‌లో రిటైల్ సేల్స్ అసోసియేట్, మొబైల్ ఫోన్ అసెంబ్లింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం వారికి విద్యార్హతలు టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదవు కున్న యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఈ ఫోన్ నెంబర్లనుసంప్రదించాలని 9381885611, సూచించారు. 9391742042, సాలూరు డిగ్రీ స్కిల్హబ్ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్ ఎక్జిక్యూటివ్ కోర్స్‌లకు ట్రైనింగ్ ఇస్తామన్నారు. అనంతరం వారికి ఉపాధి అవకాశం ఇస్తామని, విద్యార్హత ఇంటర్ ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు, మాస్టర్ ఆఫ్ కామర్స్ చదువుకున్న యువతీ, యువకులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు 8555909899, 6305110947 ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించాలని, సాలూరు ఐటిఐ కళాశాల స్కిల్ హబ్ నందు అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్, ఫిట్టర్ ఫాబిరికేషన్ కోర్సుకు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ట్రైనింగ్ అనంతరం వారికి ఉపాధి అవకాశం ఇస్తామన్నారు. విద్యాఅర్హత ఇంటర్, ఐటిఐ పూర్తి చేసిన యువకులు అర్హులని వారు 9494777553, 9666200617 సంప్రదించాలని సీతంపేట ఐటిఐ కళాశాల స్కిల్ హబ్ నందు అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్ ఫోర్ వీలర్ సర్వీస్ టెర్నియన్లు కోర్సులకు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని ట్రైనింగ్ అనంతరం వారికి ఉపాధి అవకాశం ఇవ్వడం జరుగు తుందని వారి, విద్యా అర్హత ఇంటర్, ఐటిఐ డిప్లొమా పూర్తి చేసిన వారు 7032060773 ఫోన్ నెంబరును సంప్రదించవచ్చన్నారు. ఆసక్తి గల వారు 9502407824 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

# ఈ ఏడాదీ నిరాశే

- కారు మబ్బుల ప్రభావంతో తగ్గిన జీడి పంట
- నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి
- ఆందోళన చెందుతున్న గిరిజన రైతాంగం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ ఏడాది కూడా కారు మబ్బుల ప్రభావం జీడి పంటపై పడడంతో ఆశించినంత స్థాయిలో పంట దిగుబడి లేక గిరిజన రైతుల ఆశలు అడియాసలయ్యాయి. గత మూడేళ్ల నుంచి జీడి పంట కాపు సమయాన కారు మబ్బులు కమ్ముకోవడంతో దిగుబడి పూర్తిగా తగ్గింది. జీడి పంట నష్టాన్ని చవిచూస్తున్న గిరిజన రైతులకు ఈ ఏడాది కూడా ప్రకృతి పగ వీడలేదు. ఈసారైనా జీడి పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని అనుకున్న సమయంలో గత 10 రోజుల నుంచి కారు మబ్బులు కాయడంతో జీడి పంటకు పురుగు పట్టి పాడైంది. కాసినచోట పిక్కలో పలుకు లేక బరువు తగ్గింది. మరికొన్నిచోట్ల జీడిపిక్కకు పురుగు పట్టడంతో పంట పోయిందని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఎకరా జీడితోట ఉన్న చోట అర ఎకరా కూడా పంట కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో విస్తారంగా జీడి తోటలు ఉన్నాయి. ఇక్కడ గిరిజన రైతులకు ప్రధానమైన పంట జీడి. తమ జీవనానికి, ఆర్థిక ఇబ్బందులు తీర్చేందుకు జీడిపంట ఎంతగానో దోహదపడుతుందని గిరిజన రైతులు చెబుతున్నారు. అయితే గత మూడేళ్ల నుంచి ఆశించిన స్థాయిలో పంట దిగుబడి ఉండడం లేదని అంటున్నారు. అధిక శాతం రైతులు జీడి, చింత పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

**50వేల ఎకరాల్లో సాగు**

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో సుమారు 50 వేల ఎకరాల్లో జీడి పంట సాగులో ఉంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోనే 35వేల ఎకరాల్లో జీడి తోటలు ఉన్నాయి. ఏటా సుమారు 10 వేల క్వింటాళ్ల జీడి పంట దిగుబడి వస్తోందని అంచనా. దీన్ని బట్టి చూస్తే గిరిజన రైతులు జీడి పంటపై ఎంత మేర ఆధారపడి ఉన్నారో అర్థమవుతుంది. పుష్కలమైన జీడి తోటలు ఉన్నప్పటికీ మద్దతు ధర లభించకపోవడంతో ఆర్థికంగా అభివృద్ధి చెందలేకపోతున్నారు.

**దెబ్బతీస్తున్న తేనేమంచు**

**సీతంపేట :** గత నాలుగైదేళ్లుగా చేతికొచ్చిన పంట చేయి జారిపోవడంతో జీడి రైతులు ఆందోళన చెందుతున్నారు. జీడిపంటపై ఆశలు పెట్టుకున్న గిరిజనులకు ఒక్కసారిగా ఆడి ఆశగా మారింది. గిరిజనులకు ఆర్థికంగా చేయూతనిచ్చే అటవీ ఉత్పత్తుల్లో అతి ముఖ్యమైన పంట జీడి. వీరికి ఏ పెద్ద సమస్య అయినా గట్టెక్కించేది జీడిపంట మాత్రమే. అలాంటిది నాలుగైదేళ్లుగా పంట ఇంటికి రాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో 22,000 ఎకరాల్లో జీడి సాగవుతుంది. ఈ ఏడాది బాగా కాపు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఆశ కొద్ది రోజుల్లోనే తేనె మంచు రూపంలో ఆవిరైపోయింది. తేనె మంచు, కారు మబ్బులతో పాటు మరో పక్క ఉదయం మంచు, మధ్యాహ్నం తీవ్రమైన ఎండ కాయడంతో పిందె కాసే సమయంలో ఈ ప్రభావంతో పిందె రాలిపోతుంది. తేమ పడడం వల్ల పిక్క నల్లగా మారిపోతుంది. దీంతో పాటు పిందె టీ దోమపోటు వల్ల పిక్క పెరగదు. దీంతో పాటు మరికొన్ని చోట్ల అగ్గి తెగులు ప్రభావం కూడా ఉండడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇప్పటికే కొన్నిచోట్ల జీడిపిక్కలు కాపు దశలోకి వచ్చినప్పటికీ మరికొన్నిచోట్ల పువ్వు రాలిపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. పూతికవలస, డుంబంగివలస తదితర ప్రాంతాల్లో పిక్కదశలో ఉంది. దేవనాపురం, చాపరాయిగూడ, మొగధార తదితర ప్రాంతాల్లో పువ్వు రాలి దశలోనే కనిపిస్తుంది. గత ఏడాది పంట తక్కువతో పాటు అగ్గి తెగులు వచ్చింది. అంతకుముందు రెండేళ్లు కరోనా దెబ్బతో కనీసం పంట చూడ్డానికి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది పంట కాపుకు వచ్చినప్పటికీ మంచు ప్రభావం తగలడంతో పువ్వు రాలిపోయే తేమ వల్ల పిక్క నల్లగా అయిపోవడంతో జీడి రైతులు కన్నీరుమున్నీరు పెడుతున్నారు. గతంలో కూడా సిపిఎం ఆధ్వర్యంలో జీడి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఐటిడిఎ వద్ద ఆందోళన చేసినప్పటికీ ప్రయోజనం కనిపించలేదు. ఇదిలా ఉండగా టి-దోమ నివారణకు హిమక్ క్లోరిడ్ మందును పిచికారీ చేయాలని ఉద్యానశాఖ అధికారులు అమరేశ్వరి సూచించారు.


పూత రాలిపోతున్న జీడితోట

**జీడి రైతులను ఆదుకోవాలి**

గత మూడేళ్లగా జీడి రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

**ఆరిక భాస్కరరావు**
**సిపిఎం మండల కార్యదర్శి సీతంపేట.**

**ప్రతి ఏటా ఏదో ఒక సమస్య**

జీడిపంటపై ప్రతి ఏటా ఏదో ఒక సమస్య ఉంటూనే ఉంది. ఈ ఏడాది పంట బాగానే వచ్చింది. అప్పులు తీరుతాయన్న ఆశతో ఉన్న రైతులకు తేనె మంచు, మబ్బుతో పువ్వు రాలిపోయింది. దీంతో పంట నీరుగారిపోయింది. తేనెమంచువల్ల ఎండకు పిందె మొత్తం ఎండి రాలిపోతుంది.

**ఆరిక గంగారావు, గిరిజనుడు.**

**జీడి దిగుబడి తగ్గింది....**

కారు మబ్బుల వల్ల జీడి పంటకు పురుగు పట్టడంతో ఈ ఏడాది కూడా జీడిపంట దిగుబడి బాగా తగ్గింది. పిక్కలు కాసినా, లోపల పలుకు లేకపోవడంతో జీడి అమ్మకాలు చేపట్టిన అనుకున్నంత మద్దతు ధర రాదు. ఈ ఏడాది ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

**పువ్వల స్వామి,**
**గిరిజన రైతు, పి.ఆమిటి**

**పురుగు మందులు సరఫరా లేదు**

గత మూడేళ్ల నుంచి జీడి పంటకు తీవ్రనష్టం వాటిల్లితున్నా రక్షణ చర్యలు చేపట్టడంలో అటు ప్రభుత్వం, ఇటు ఐటిడిఎ అధికారులు శ్రద్ధ వహించడం లేదు. దీంతో ప్రతి ఏడాది జీడిపంటపై ఆశలు పెట్టుకున్నా రైతులకు తీవ్ర నిరాశే మిగులుతుంది. ఈసారైనా అధికారులు మేల్కొని జీడి పంట నష్ట నివారణకు పురుగు మందులు సరఫరా చేయాలి.

**కోలక అవినాష్**
**ఎపి గిరిజన సంఘం నాయకులు**

**రుణమాఫీ చేయాలి...**

గిరిజన రైతులు పండించే పంటలకు నష్టం వాటిల్లడంతో ఆర్థికంగా చితికి పోతున్నారు. వేలాది రూపాయలు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకున్నా పంట చేతికి అందకపోవడంతో కట్టలేని పరిస్థితి. ప్రభుత్వం స్పందించి రైతులు తీసుకున్న అప్పులను రుణమాఫీ చేయాలి.

**మండంగి రమణ ఎంపిటిసి, చెముడుగూడ**

## పాఠశాల భవనాన్ని తక్షణమే ప్రారంభించాలి

**కురుపాం :** మండలంలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రూ.4.30కోట్ల వ్యయంతో నిర్మించిన పాఠశాల భవనాన్ని వెంటనే ప్రారంభించాలని గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ ఐటిడిఎ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల సౌలభ్యం కోసం భవనం నిర్మించినంత వరకూ బాగానే ఉన్నప్పటికీ ఆ భవనం నిర్మించి మూడేళ్లయినా నేటికీ ప్రారంభించకపోవడం వల్ల విద్యార్థులు పాత భవనాల్లో చాలీ చాలిన ఇరుకు గదుల్లో చదువుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించి పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించి గిరిజన విద్యార్థుల చదువులకు సహకరించాలని ఆయన కోరారు.

## త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎఇ జానకి రామయ్య

**సీతానగరం :** జగనన్న లేఅవుట్ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని హౌసింగ్ ఎఇ సిహెచ్ జానకిరామయ్య అన్నారు. మండలం లోని చెల్లంనాయుడువలసలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఔట్‌లో లబ్ధిదారులకు కావాల్సిన సామగ్రిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి వారం రోజులకు వారు చేసే పనిని పేమెంట్లు జరుగుతాయన్నారు. ఉగాది నాటికి లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీటర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పి.కృష్ణ, సత్యనారాయణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటిక నిర్మాణానికి విరాళం

**కురుపాం :** కురుపాంలో నిర్మిస్తున్న ముస్లింల శ్మశానవాటికకు విశాఖపట్నంలో గల ప్రముఖ గుండె వైద్య నిపుణులు ప్రసాద్ లాల్ రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, ముస్లిం కమిటీ సభ్యులు షేక్‌గౌస్, నౌషాద్, బకరి, రఫీ మంగళవారం విశాఖపట్నంలో ఆయన నివాసం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం సభ్యులు మాట్లాడుతూ కురుపాంలో జన్మించి ప్రముఖ గుండె వైద్య నిపుణులుగా విశాఖలో స్థిరపడి ఉన్నప్పటికీ తన సొంత ఊరైన కురుపాం గ్రామస్తులకు ఎప్పుడు ఏ అవసరమైన తక్షణమే స్పందించి ఆదుకుంటున్నారని అభినందించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌లాల్‌కు ముస్లిము కృతజ్ఞతలు తెలిపారు.


చెక్‌ను అందజేస్తున్న డాక్టర్ ప్రసాద్‌లాల్

## విజేతలకు బహుమతులు అందజేత


విద్యార్థికి బహుమతిని అందజేసుత్న న్యాయమూర్తి

**పాలకొండ రూరల్ :** అంతర్జాతీయ మహిళా వారోత్సవాలు సందర్భంగా మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినిలకు జడ్జి అగ్గాల విజయ్ రాజ్‌కుమార్ స్థానిక కోర్టులో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గున్నారు.

## సమస్యల పరిష్కారానికే సర్వసభ్య సమావేశం

**కురుపాం:** సమస్యలు పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని, సమస్యలు పరిష్కారానికే సర్వసభ సమావేశమని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ వివి శివరామప్ప ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సమస్యలు ఏమైనా ఉంటే సర్పంచులు, ఎంపీటీసీలు సర్వసభ్య సమావేశంలో మండల అధికారులకు తెలియజేసినట్లయితే వారికి అనుకూలమైనవి ఉంటే సమస్యలైతే పరిష్కరిస్తారని లేదంటే పై అధికారులకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. అలాగే వేసవి నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు ఎవరూ తాగునీటి సమస్యలతో ఇబ్బంది పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి జి.సుజాత, వైస్ ఎంపిపిలు రంగారావు, బి.అన్నాజీరావు మండలంలో గల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి

## పైపులు పక్కదారికి ప్రయత్నించలేదు

**కొమరాడ :** క్రాస్ ప్రోగ్రాం నిమిత్తం కొనుగోలు చేసిన సామగ్రి, పైపులు పక్కదారి పట్టలేదని ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు తెలిపారు. 'ప్రజాశక్తి'లో మంగళవారం ప్రచురితమైన క్రాస్ పోగ్రాం పైపులు పక్కదారికి ప్రయత్నం అన్న శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఎంపిడిఒ స్పందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని కుంతేసు పంచాయతీకి కాస్ ప్రోగ్రాం నిమిత్తం పార్వతీపురం మీదుగా బోరు పైపులు వెళ్తున్నాయని తెలిపారు. అది చూసి కొంతమంది పైపులు పక్కదారి పట్టినట్లు తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. మండలంలో క్రాస్‌ప్రోగ్రామ్‌కు సంబంధించిన పైపులు ఎటువంటి పక్కదారి పట్టలేదని తెలిపారు. అలాగే ప్రతి పైపు మరమ్మతులు చేసి కొత్త పైపు వేస్తే రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేస్తున్నామని అన్నారు.

## పడకేసిన పారిశుధ్య పనులు

**కొమరాడ :** మండల కేంద్రంలో 12 రోజులుగా పంచాయతీ కార్యదర్శి తీరు వల్ల పారిశుధ్య పనులు పడకేశాయని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. కార్మికుల జీతాల కోసం వెళ్తే ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడం అన్యాయమన్నారు. ఆయన తీరు వల్ల 12 రోజులుగా చెత్తాచెదారం గ్రామంలో విచ్చలవిడిగా ఉండే పరిస్థితి ఉందని అన్నారు. దీనికి కారణమైన కార్యదర్శిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కావున వెంటనే ఇటువంటి కార్యదర్శిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## 16 నుంచి కోటదుర్గ ప్రతిష్ట మహోత్సవాలు

**వీరఘట్టం :** మండల కేంద్రంలోని ఈనెల 16 నుండి కోట దుర్గ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక సర్వ జోషులు శ్రీ వెంకటలక్ష్మి నరసింహాశర్మ యాజి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రతిష్ట మహోత్సవానికి మండల కేంద్ర ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## ఉపాధి పనుల పరిశీలన

**పాలకొండ రూరల్ :** మండలంలోని గోపాలపురంలో ఉపాధిహామీ చట్టం ద్వారా జరుగుతున్న అంపిలి బట్టి పనులను ఎంపిడిఒ డొంక త్రినాధులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వేతన దారులు సమయపాలన పాటించి ఉపాధి పనులు చేపట్టాలన్నారు. నిర్ధేశిత కొలతల ప్రకారం పనులు చేసి గిట్టుబాటు వేతనం పొందాలన్నారు.


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

## హైడ్రామా నడుమ పోలీసుల అదుపులో డొంకాడ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సోమవారం టిడిపి అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణను పోలీసుల అదుపులో ఉంచుకొని సాయంత్రానికి విడిచిపెట్టారు. ఏమయిందో ఏమో కానీ సోమవారం రాత్రి పోలీసులు చిన్న కుదమ వెళ్లి డొంకాడను అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో రామకృష్ణ తన ఇంట్లో లేకపోవడంతో పోలీసులు వెనుతిరిగినట్లు తెలిసింది. మంగళవారం మధ్యాహ్నం డొంకాడ రామకృష్ణ తన లాయర్‌తో స్వచ్ఛందంగా చిన్నమేరంగి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. పాలకొండ డిఎస్‌పి కృష్ణారావు వచ్చి ఆయన తన వాహనంలో రామకృష్ణను ఎక్కించుకొని కొంత దూరం వెళ్లిన తర్వాత మళ్లీ చిన్నమేరంగి పోలీస్ స్టేషన్‌కు వచ్చి విడిచిపెట్టారు. సాయంత్రం నాలుగు గంటల వరకు రామకృష్ణను పోలీస్ స్టేషన్లో ఉంచారు. మీడియాను కూడా పోలీసులు అనుమతించకుండా రాత్రి 7 వరకు కూడా ఎటువంటి సమాచారాన్ని విలేకరులకు తెలియజేయకపోవడం శోచనీయం.


పోలీసు స్టేషన్ వద్ద గుడిగూడిన టిడిపి కార్యకర్తలు

## వివాద స్పదమైన గారమ్మకాలనీ స్థలం

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో గారమ్మకాలనీలో స్థానిక అవసరాల కోసం కేటాయించిన స్థలం ఆక్రమణకు గురికావడంతో వివాదమైంది. గారమ్మకాలనీ వాసులంతా ఈ విషయంపై పట్టుబట్టారు. సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని కబ్జా చేశారంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం గారమ్మకాలనీ ప్రాంతాన్ని తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, ఉపతహశీల్దార్ బి.బుచ్చయ్య పరిశీలించగా జనసేన నాయకులు ప్రశాంత్‌తో పాటు స్థానికులు అక్కడకు చేరుకుని ఈ స్థలంలో కొంతమంది ఆక్రమణలకు పాల్పడుతున్నారని గతంలో 60 సెంట్లుగా ఉన్న స్థలం 25 సెంట్లు మిగిలిందని అన్నారు. ఈ స్థలాన్ని కాపాడి సామాజిక అవసరాలకు కేటాయించాలని స్థానికులు కోరారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ఈ స్థలాన్ని నగర పంచాయతీకి కేటాయించడం జరిగిందని, ఈ స్థలం విషయంలో తమ ప్రమేయమేమీలేదని తేల్చి చెప్పారు. వారంతా నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావును కలిసి స్థలం కబ్జా కాకుండా కాపాడాలని వినతిపత్రం అందించారు.


అధికారులకు వినతిని అందజేస్తున్న గారమ్మకాలనీ వాసులు

## హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్, గరుగుబిల్లి

గరుగుబిల్లి మండలం రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సందర్శించారు. ఈ మేరకు ఆయన పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేసి వాటిని గ్రామాల్లో ఏ విధంగా వైద్య సిబ్బంది నిర్వహిస్తున్నది సమీక్షించారు. ఎనీమియా ముక్త భారత్, ఇందులో గర్భిణులు, బాలింతలు, ఆరోగ్య పర్యవేక్షణ, హైరిస్క్ గర్భిణీల బర్త్ ప్లానింగ్, కిశోర బాలికల హెల్త్ స్క్రీనింగ్ , యుక్త వయస్సు వివాహాలు తద్వారా వచ్చే ఆరోగ్యంపై ప్రభావాన్ని క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని, ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో పిల్లల నమోదు, టీకా కార్యక్రమాల నమోదు పక్కాగా ఉండాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గ్రామాల్లో పూర్తి స్థాయిలో నిర్వహించాలని, దీర్ఘ కాలిక రోగుల ఆరోగ్యానికి సంబంధించిన ఎన్‌సిడి - సిడి సర్వే , తదితర శాఖల సమన్వయంతో డ్రై డే కార్యక్రమాల నిర్వహణ, గ్రామ ఆరోగ్య పారిశుధ్య పోషకాహార కమిటీల నిర్వహణ, ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన వారి ఆరోగ్య పర్యవేక్షణ, ఫీవర్ సర్వే, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ మొదలగు అంశాలపై సమీక్ష నిర్వహించి క్షేత్ర స్థాయిలో పక్కాగా నిర్వహించాలని సూచించారు. అలాగే ఆశా కార్యకర్తలు వారికిచ్చిన మొబైల్‌లో ఇ - ఆశా యాప్‌లో వారి పరిధిలో ఉండే మాతా, శిశు ఆరోగ్య కార్యక్రమాలన్నీ నమోదు చేయాలని డిఐఒ జగన్మోహనరావు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కె.అరుణకుమారి, కె.కార్తీక్, సూపర్‌వైజర్లు ఎస్ ఎస్ ప్రకాష్, ఎం.సన్యాసమ్మ, జయ గౌడ్ , వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు

## నదులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

నదుల్ని కాపాడుకుంటేనే మానవాళితో పాటు సమస్త జీవరాసులకు మనుగడ అని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. అంతర్జాతీయ నదుల పరిరక్షణ చర్యల దినోత్సవాన్ని సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు సత్య సింహ చక్రవర్తి ఆధ్వర్యంలో సమితి జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు, ప్రతినిధులు రెడ్డి శ్రీనివాసరావు, కొల్లు రణేషుబాబులతో కలిసి సువర్ణముఖి నదిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణముఖి నదిలో పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం వారు మాట్లాడుతూ మానవాళితో పాటు ఎన్నో రకాల జీవజాతుల మనుగడకు నదులే ఆధారమన్నారు. మితిమీరిన మానవ కార్యకలాపాల వల్ల నదులు స్వచ్ఛతను, ఉనికిని కోల్పోతున్నాయన్నారు. వీటి పరిరక్షణ పట్ల అందరికీ బాధ్యత ఉండాలన్నారు. ముఖ్యంగా నదుల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు లేకుండా చూడాలన్నారు. నదులు కాలుష్యం బారిన పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. మానవులకు ఏ విధంగా చట్టప్రకారం హక్కులు ఉన్నాయో, నదులకు కూడా అలాగే చట్టప్రకారం హక్కులు ఉన్నాయన్నారు. వాటికి భంగం కలగకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. నదులు, జలాశయాల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. జలచక్రం, జీవవైవిధ్యానికి ఆధారమైన నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మానవాళితో పాటు సమస్త జీవరాసుల ఉనికికి ప్రమాదమన్నారు. నదుల్లో అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టడం, కాలుష్యాన్ని నివారించడం చర్యలు చేపట్టి నదులను పరిరక్షించాలని కోరారు.


కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న సిర్లిపోతన్న వీధి మహిళలు

## తాగునీటి సమస్యపై మహిళల నిరసన

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సిర్లిపోతన్న వీధికి చెందిన మహిళలు నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్ లైన్లు మరమ్మతులకు గురికావడం వల్ల 15 రోజుల నుండి మంచి నీరు కుళాయిల ద్వారా రావడంలేదని, బురద నీరే వస్తుందని తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉండడం వల్ల సిర్లిపోతన్న వీధిలో సుమారు 105 కుటుంబాలు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. పైప్ లైన్ ద్వారా మంచి నీర సరఫరా చేసేంత వరకూ వాటర్ ట్యాంక్ ద్వారా తాగునీరు సరఫరా చేయాలని కోరారు. పారిశుధ్యం సంపూర్ణ నివారణకు తగు చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావును కోరారు. అనంతరం సమస్యల పరిష్కారం కోరుతూ కమిషనర్‌కు వినతిని అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ సిర్లిపోతన్న వీధిలో మంచినీరు, పారిశుధ్య సమస్య తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వాటర్ ట్యాంక్ ద్వారా నీరు సరఫరా చేస్తామని తెలిపారు. నిరసన కార్యక్రమంలో కె.గౌరీశ్వరి, సిర్లిపోతన్న వీధి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బిల్లులు మంజూరు చేయండి

**ఎస్‌ఇని కోరిన వైస్ చైర్మన్, కౌన్సిలర్లు**

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు మంజూరు చేయాలని వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు పబ్లిక్ హెల్త్ ఎస్‌ఇ కె.రాజారావును కోరారు. మంగళవారం వారు పబ్లిక్ హెల్త్ ఎస్‌ఇ కార్యాలయంలో ఆయన్ను కలిసి మున్సిపల్ సమస్యల గురించి వివరించారు. 14, 15 ఫైనాన్స్ కమిషన్ నిధులతో చేపట్టిన పనులకు బిల్లులు సకాలంలో మంజూరు చేయాలని కోరారు. ఆ బిల్లులు మంజూరు చేస్తే కొత్త పనులు ప్రారంభించవచ్చునని చెప్పారు. గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న మున్సిపల్ డిఇ పోస్టును వెంటనే భర్తీ చేయాలని కోరారు. బిల్లుల అప్ లోడింగ్ త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్, కౌన్సిలర్లు బి.శివప్రసాద్, తాడి శంకరరావు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ తాడి యశోదకృష్ణ ఎస్‌ఇని కోరారు.


ఎస్‌ఇతో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ అప్పలనాయుడు

## అగ్ని గంగమ్మ జాతరకు పోటెత్తిన జనం

**పార్వతీపురం రూరల్ :** జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో ఒడిశా సరిహద్దుల్లో కోరాపుట్ జిల్లా బందుగాం బ్లాకు నీలావడిలో జరుగుతున్న అగ్ని గంగమ్మ జాతరకు ఆంధ్రా - ఒడిశా గ్రామాల నుంచి భక్తులు పోటెత్తారు. వనంగుడిలో ఉన్న అమ్మవారిని వారం రోజుల పాటు నీలావిడికి తీసుకొచ్చి ఘటాల రూపంలో పూజలు చేస్తారు. ఉదయం జరిగిన తోలేళ్ళ ఉత్సవం వైభవంగా నిర్వహించగా జాతరలో ప్రధాన దినమైన మంగళవారం అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముఖ్యంగా ఆదివాసీలకు ఆరాధ్య దైవమైన అమ్మవారిని దర్శించుకుని బుధవారం వేకుజామున జరిగే మల్లెలు నిప్పులు తొక్కే కార్యక్రమం జరిగిన తర్వాత అమ్మవారిని వనంగుడికి తీసుకెళ్తారు. అంతటితో పండగ ముగుస్తుంది. ఈ జాతర సందర్భంగా ఏర్పాట్లు చేసిన అంగళ్ళు పండుగకు మరింతగా శోభను చేకూర్చుతాయి.


ఆలయాన్ని గటాలు తీసుకెళ్తున్న భక్తులు

## ఆలయ నిర్మాణానికి మార్కింగ్

**సీతంపేట :** ఆలయాల నిర్మాణానికి టిటిడి కేటాయించిన నిధులతో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మత్స్యకార కాలనీల్లో మంగళవారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణ మార్కింగ్ ఇచ్చారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వరాయి కళావతి సూచనల మేరకు దేవాలయాల పనులు శరవేగంగా పూర్తి చేస్తామని అన్నారు. మండలంలోని ఇసుగెడ్డ, పెద్దూరు, వలగెడ్డ, కొత్తపనుకువలస, పాత పనుకువలస, గడిగుడ్డి, పెద్దరామ, నాయుడుమల్లి, దారిమల్లి, సంతమల్లి, కుసిమి గ్రామాల్లో దేవాలయ నిర్మాణాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, వైసిపి నాయకులు రాము, ఎంపిపి బి ఆదినారాయణ, వైస్ ఎంపిపి కె.సరస్వతి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, కళావతి, ఆదిలక్ష్మి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి మార్కింగ్ వేస్తున్న అధికారులు

## మెకానిక్ షెడ్ దగ్ధం

**విజయనగరం :** నగరంలోని తోటపాలెం సెంట్రల్ బ్యాంకు ఎదురుగా గల మెకానిక్ షెడ్‌కు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి నిప్పుపెట్టారు. వైఎస్‌ఆర్ కాలనీలో నివాసముంటున్న రాపాక కృష్ణ సెంట్రల్‌బ్యాంకు వద్ద మెకానిక్‌షెడ్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షెడ్‌కు పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో అందులో ఉన్న 15 బైక్‌లు, పలు ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. సామాగ్రి, ఇంజిన్ ఆయిల్ డబ్బాలు దగ్ధమయ్యాయి. పలువురు రిపేరు కోసం ఇచ్చిన బైక్‌లు కాలిపోవడంతో షెడ్ యజమాని తీవ్ర ఆందోళన చెందారు. ఘటనలో సుమారు 3లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని అంచనా. కృష్ణ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు, ఎస్‌ఐ అశోక్ కుమార్ తదితరులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. మద్యం, గంజాయి వంటి దురలవాట్లకు బానిసలైన ఎవరో ఆకతాయిలు ఈ ఘటనకు పాల్పడి ఉంటారని సిఐ తెలిపారు. సిసి కెమెరాలు ఆధారంగా నిందితులను పట్టుకుంటామన్నారు. సంఘటనా స్థలాన్ని వైసిపి నాయకులు బి.రవిచంద్ర, కార్పొరేటర్ రంగా పరిశీలించారు.


దగ్ధమైన బైకులు